
సాక్షి బాపట్ల

శుక్రవారం। 15। మార్చి। 2024



ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

ఈపూరు : బొగ్గరంలో ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామిని దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 513.90 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మకు వెండి గంగాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మకు నగరానికి చెందిన భక్తులు 12.5 కిలోల వెండి గంగాళాలు, మూతలను గురువారం అందించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
బాపట్ల	6.23	4.59
గుంటూరు	6.23	4.59
చిలకలూరిపేట	6.26	5.00

న్యూస్‌రీల్

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గురువారం విడుదల చేశారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టులో అభ్యంతరాలు ఉంటే ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ధ్రువపత్రాలతో అందజేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు వైద్య కళాశాల నోటీసు బోర్డులో, గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

దేశమ్మ తల్లి ఆలయానికి భూమిపూజ



పెదకూరపాడు: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వాణి ట్రస్ట్ వారి రూ.10 లక్షల ఆర్థిక సహాయంతో మండలంలోని 75 త్యాళ్ళూరులో గ్రామ దేవత దేశమ్మ తల్లి ఆలయానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చిర్రా శ్రీనివాసరెడ్డి, వజ్రాల శ్రీనివాసరెడ్డి, ములకా వెంకటరెడ్డి, చిర్రా రాఘవరెడ్డి, అల్లం మాధవరెడ్డి, ఈదా సాంబిరెడ్డి, కొల్లి లింగారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఆధ్యాత్మికత భావం పెంపొందించేందుకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో శ్రీవాణి ట్రస్ అందించిన ఆర్థిక సహాయంతో దేవాలయం నిర్మాణం త్వరితగతి పూర్తి చేస్తామని తెలిపారు.

నేడు ఐఎంఏలో సీఎంఈ

గుంటూరు మెడికల్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో గుంటూరులోని ఐఎంఏ హాలులో శుక్రవారం నిరంతర వైద్య విద్యా కార్యక్రమం (సీఎంఈ) నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. హైపో థైరాయిడిజం – వంధ్యత్వం అనే అంశంపై ఎండ్రోకైనాలజిస్ట్ డాక్టర్ లావణ్య కటకం, వంధ్యత్వం చికిత్సలో ఆధునిక పద్ధతులు అంశంపై డాక్టర్ స్వప్న శ్రీకాంత్ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. వైద్యులందరూ ఈ కార్యక్రమానికి హాజరై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

18 నుంచి ఒంటి పూట బడులు

గుంటూరు ఎడ్యుకేషన్ : పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ఈనెల 18 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒక్కపూట తరగతులు నిర్వహించాలని డీఈవో పి.శైలజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మధ్యాహ్నం 12.30 తరువాత అందించాలని హెచ్ఎంలను ఆదేశించారు. ఒకటి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఎస్ఏ–2 పరీక్షలను గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే నిర్వహించాలని, చెట్ల కింద, ఖాళీ ప్రదేశాల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. టెన్త్ పరీక్షలు జరిగే కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి తరగతులు నిర్వహించేందుకు వీల్లేదని, ఆయా పాఠశాలల్లోని ఒకటి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఈనెల 18 నుంచి ఏప్రిల్ 23 మధ్య కాలంలో అందుబాటులో ఉన్న సెలవు దినాల్లో విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు తరగతులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6500, గరిష్ట ధర రూ.8200, మోడల్ ధర రూ.7300 వరకు పలికింది.

మహిళా సాధికారతకు బాటలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: పేద మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద లబ్ధిదారులైన మహిళలకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా బనగానపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి గురువారం బటన్ నొక్కి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి కలిసి లబ్ధిదారులకు నమూనా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ప్రభుత్వం బాటలు వేస్తోందని చెప్పారు. అన్ని సామాజిక వర్గాలలో ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఈ పథకాన్ని వర్తింపచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. పేద మహిళలకు ఏడాదికి రూ.15000 చొప్పున గడిచిన మూడేళ్లలో రూ.45000 ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలో 25,128 మందికి రూ.37.69 కోట్లు అందించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలలోకి నగదు జమ చేసినట్లు వివరించారు. ప్రభుత్వం కల్పించే అవకాశాల్ని లబ్ధిదారులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ సాయంతో జీవనోపాధి యూనిట్లు స్థాపించుకుని ఉన్నతంగా ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఏఈ ఓ చిట్టిబాబు, సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రాల్లో రక్షణ చర్యలతో పాటు కౌంటింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేపట్టాలని సంబంధిత అధికారుల్ని కలెక్టర్ పి. రంజిత్‌బాషా ఆదేశించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌తో కలసి నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, బాపట్ల పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ పూర్తయిన వెంటనే ఈవీఎంలను కౌంటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు అందజేసేటప్పుడు గందరగోళానికి గురి కాకుండా చక్కని ప్రణాళిక రచించుకోవాలని అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూంలో పోలింగ్ స్టేషన్లకు తగ్గట్టుగా అవసరమైన ర్యాకులు సరిచూసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన టేబుళ్లు, మెష్ ఏర్పాటు, పార్టీల ఏజెంట్లు, సంబంధిత అధికారులు రాకపోకలకు వీలుగా అనువైన మార్గం తదితర అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రం వెలుపల కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో సత్తిబాబు, ఆర్‌ఓలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చర్యలు సకాలంలో చేపట్టాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో గురువారం రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.తొలుత రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యల్ని జిల్లా రవాణా అధికారి సురేష్ వివరించారు. దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 50 శాతం పైగా యువత మృత్యువాత పడుతోందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తమ శాఖ ఆధ్వర్యంలో అన్ని కళాశాలలు, హైస్కూళ్లలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పట్టణాల ప్రధాన కూడళ్లను క్షుణ్ణంగా పరిశీలించి సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ రహదారి వెంబడి కళాశాలున్న ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా సైన్ బోర్డులు, డేంజర్ గుర్తులు, డైవర్షన్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు. జాతీయ రహదారిలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో లైట్లు బ్లింకింగ్ చేయడం , హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని చెప్పారు రోడ్లపై ఇసుక ఉండడంతో ద్విచక్ర వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారని, ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించే సందర్భంలో గతంలో ప్రమాదాలకు సంబంధించిన వీడియోలు ప్రత్యేకంగా ప్రదర్శించితే సత్ఫలితాలు ఉంటాయని సూచించారు. రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలు చేయాలని అధికారుల్ని కలెక్టర్ ఆదేశించారు.

సచివాలయాల ద్వారా పారదర్శకంగా సేవలు

మంత్రి మేరుగ నాగార్జున



వేడుకల్లో పాల్గొన్న మేరుగ నాగార్జున

పెదపూడి(వేమూరు) : గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు పారదర్శకంగా అందుతున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. అమర్తలూరు మండలంలోని పెదపూడిలో గ్రామ సచివాలయాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం కూచిపూడిలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు యలవర్తి రామోహనరావు తృతీయ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్న దానం కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయం, రైతు భరోసా, వైఎస్సార్ క్లినిక్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందుతున్నాయని తెలిపారు. బాపట్ల జిల్లా అర్బన్ అభివృద్ధి చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు మాట్లాడుతూ యలవర్తి రామోహనరావు వైఎస్సార్ సీపీకి చేసిన సేవ మరువలేనిదని కొనియాడారు. వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబును గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండముది శ్యామల, పెదపూడి సర్పంచ్ పెదపూడి ఆనంద్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు తెనాలి ప్రవీణ్, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, యల్లమాటి మోహనరావు, పార్టీ మండల అధ్యక్షులు యలవర్తి సురేష్, బొల్లిముంత ఏడుకొండలు, గాజుల మోహన్, అశోక్, బసివి రెడ్డి, దున్నా మేరీసుబాబు, గుమ్మడి రవిరాజు, మోదుకూరు హరిబాబు, గ్రామ సర్పంచ్ దేవరకొండ రాము, అంబటి రామోహనరావు, అజయ్, బర్నా ప్రవీణ్ పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

చేయూత పంపిణీలో సమన్వయకర్త కరణం వెంకటేష్



వైఎస్సార్ చేయూత చెక్కును మహిళలకు అందిస్తున్న సమన్వయకర్త వెంకటేష్

చీరాల: మహిళల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్ మేలు మరువకుండా మళ్లీ ఆయన్నే గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం వెంకటేష్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్ఆర్ అండ్ సీఎం హైస్కూలు ఆవరణలో ఉన్న ఏటీ థియేటర్‌లో గురువారం లబ్ధిదారులకు నాలుగో విడత వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సమన్వయకర్త కరణం వెంకటేష్ మాట్లాడుతూ చేయూత ద్వారా నాలుగు విడతలుగా నియోజకవర్గంలో 14,175 మందికి రూ.96 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. అనంతరం చేయూత చెక్కులతో పాటు ఈబీసీ పత్రాలు, మహిళలకు స్వయం ఉపాధికి కుట్టు, ఎంబ్రాయిడరీ మిషన్లు అందించారు. మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ కృష్ణ, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఎంపీడీవో శోభారాణి, ఏపీఎం సుబ్బారావు, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు అంకాళరెడ్డి, పీఎసీఎస్ చైర్మన్ కేశవులు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎన్.రాజ్‌కుమార్, ఆర్‌బీకే చైర్మన్ రమణారెడ్డి, కౌన్సిలర్లు కీర్తి వెంకటరావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, మామిడాల రాములు, మించాల సాంబశివరావు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ల వీరంగం



ఇరవై వార్డు కౌన్సిలర్‌పైకి దూకుతున్న టీడీపీ కౌన్సిలర్



చైర్మన్ చాంబర్ వైపు వెళ్లి దుర్భాషలాడుతున్న టీడీపీ మహిళా కౌన్సిలర్

- దళిత మహిళా చైర్మన్‌ను దుర్భాషలాడిన టీడీపీ కౌన్సిలర్లు
- సభా మర్యాద మరచి పిచ్చిపట్టినట్లు ప్రవర్తించిన వైనం
- చదువులేని దానివి.. నీకేం తెలుసు అంటూ చులకన

అద్దంకి: తెలుగుదేశం పార్టీ రోజురోజుకూ దిగజారిపోతుందనడానికి గురువారం జరిగిన మున్సిపల్ సమావేశమే నిదర్శనం. రాబోయే ఎన్నికల్లో గెలవలేమనే పరిస్థితి అర్థం కావడంతో టీడీపీ నాయకులు బరితెగిస్తున్నారు. తాజాగా అద్దంకి మున్సిపల్ సమావేశంలో ఆ పార్టీ కౌన్సిలర్లు వీరంగం సృష్టించారు. వైఎస్సార్ సీపీకి చెందిన చైర్మన్ సహా కౌన్సిలర్లపై దాడికి దిగారు. దళిత టీడీపీ మహిళా కౌన్సిలర్‌తో దుర్భాషలాడించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో గురువారం చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ప్రారంభం కాగానే ముందు తమ ప్రశ్నలకు సమాధానం చెప్పి తరువాత అజెండాలోకి వెళ్లడంటూ టీడీపీ కౌన్సిలర్లు అడ్డుకుని, అడగటం ప్రారంభించారు. కమిషనర్ జీరో అవర్‌లో అడగండని చెప్పినా వినలేదు. చెత్త సరిగా ఎత్తడం లేదని ఓ టీడీపీ కౌన్సిలర్ అడిగారు. పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉన్నారని.. ఈ రోజే శుభ్రం చేయిస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సమాధానం చెప్పారు. మధ్యలో 20 వార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు అధికారులకు విషయాన్ని వివరించి చెప్పే సమయంలో 12వ వార్డుకు చెందిన టీడీపీ కౌన్సిలర్ అత్తులూరి రమేశ్ ఆయనతో వాగ్వివాదానికి దిగాడు. సమాధానం చెప్పబోయిన మిగిలిన కౌన్సిలర్లపై టీడీపీకి చెందిన ఆరో వార్డు కౌన్సిలర్ కె. రజని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, చైర్మన్ వైపునకు వెళ్లి వీరంగం వేసింది.

చైర్మన్‌ను కించపరచిన టీడీపీ కౌన్సిలర్

ఇది ఇలా ఉంటే టీడీపీ కౌన్సిలర్లను కూర్చోమని చెప్తున్న చైర్మన్ ఎస్తేరమ్మను ఆరో వార్డు కౌన్సిలర్ రజని దుర్భాషలాడింది. చదువులేని దానివి.. నీకేం తెలుసు.. ఎక్కడైనా సరిగా పనులు చేయించావా ? అంటూ చాంబర్ వద్దకు వెళ్లి దుర్భాషలాడింది. దీంతో ఆమె కంటతడి పెట్టుకుని అంశాలను ఆమోదించినట్లు ప్రకటించి అధికారులతో బయటకు వెళ్లారు. సమావేశంలో కమిషనర్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కె.అనంతలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భగ్గుమన్న 'కొమ్మాలపాటి' వర్గం

- భాష్యం ప్రవీణ్‌కు సీటు కేటాయించడంతో తీవ్ర నిరాశలో కొమ్మాలపాటి
- కనీసం పిలిచి మాట్లాడలేదని అనుచరుల వద్ద ఆవేదన
- కొమ్మాలపాటి శ్రీధర్‌ను కలిసేందుకు వెళ్లిన ప్రవీణ్...కొద్దిసేపు ఉద్రిక్తత
- టికెట్ ఇవ్వకముందే ఎందుకు హడావుడి చేశావని ప్రవీణ్‌పై ఆగ్రహం
- పార్టీలోనే ఉంటే సహకరిస్తానని చెప్పి హైదరాబాద్ వెళ్లిన శ్రీధర్
- శ్రీధర్ వర్గంపై బెదిరింపులకు పాల్పడుతున్న ప్రవీణ్ వర్గం



గుంటూరులో ఆందోళన చేస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్ అనుచరులు

సాక్షి, నరసరావుపేట, పెదకూరపాడు: టీడీపీ రెండో జాబితాలో పెదకూరపాడు స్థానం భాష్యం ప్రవీణ్‌కు కేటాయించడంపై మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కొమ్మాలపాటి శ్రీధర్ అనుచరులు ఒకసారిగా భగ్గుమన్నారు. టికెట్ కొమ్మాలపాటికే కేటాయిస్తారని ముందుగా గుంటూరులోని నివాసానికి గురువారం ఉదయం ఆయన అనుచరులు భారీగా చేరుకున్నారు. స్వీట్లు, బాణసంచా కూడా సిద్ధం చేసుకున్నారు. మధ్యాహ్నం టీడీపీ టికెట్ భాష్యం ప్రవీణ్‌కు కేటాయిస్తున్నట్లు పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించడంతో ఒకసారిగా కొమ్మాలపాటి శ్రీధర్ వర్గీయులు ఆందోళన చేపట్టారు. ఆయనకే టికెట్ కేటాయించాలని నినాదాలు చేశారు.

భాష్యం ప్రవీణ్‌పై కార్యకర్తల ఆగ్రహం

టీడీపీ టికెట్ ప్రకటించిన కొద్దిసేపటికి భాష్యం ప్రవీణ్ గుంటూరులోని కొమ్మాలపాటి శ్రీధర్ ఇంటికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఆందోళన చేస్తున్న కార్యకర్తలు ఆయన్ను చూసి మండిపడ్డారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అచ్చంపేటకు చెందిన టీడీపీ కార్యకర్తలు ప్రవీణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్ కేటాయించకముందే నియోజకవర్గంలో ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లతో హడావుడి ఎందుకు చేశారు అని ప్రశ్నించారు? స్థానికేతరుడు అంటూ నినాదాలు చేశారు. దీంతో ఒకసారిగా భాష్యం ప్రవీణ్ టీడీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకెందుకు.. ఏమైనా ఉంటే మేము మేము చూసుకుంటాం..మీరెవ్వరు ? అంటూ గట్టిగా అరవడంతో కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. ఇదే సమయంలో కొమ్మాలపాటి తన అనుచరుల్ని సముదాయించారు.

కనీస గౌరవం దక్కలేదు

టికెట్ దక్కకపోవడంపై కొమ్మాలపాటి శ్రీధర్ ముఖ్య అనుచరుల వద్ద జరిగిన అన్యాయంపై వాపోయారట. వరుసగా నాలుగు పర్యాయాలు పెదకూరపాడులో టీడీపీ ఓడిపోతూ అభ్యర్థులు కరువైన సమయంలో 2009లో పోటీ చేసి గెలిచానని, పార్టీ కోసం 18 సంవత్సరాలు కష్టపడితే ఇదేనా దక్కిన గౌరవం అంటూ ఆవేదన చెందారట. పార్టీ కోసం ఎంతో డబ్బు ఖర్చు చేసినా చంద్రబాబు కనీసం పిలిచి మాట్లాడకపోవడం అన్యాయమన్నారట. నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపి శ్రీధర్ హైదరాబాద్ వెళ్లిపోయారు.

పార్టీలో ఉంటే సహకరిస్తా !

కొమ్మాలపాటి శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన భాష్యం ప్రవీణ్ రాబోయే ఎన్నికల్లో సహకరించాలని కోరారట. దీనికి స్పందనగా శ్రీధర్ మాట్లాడుతూ.. పార్టీలోనే ఉంటే కచ్చితంగా సహకరిస్తానని, ఏమి జరుగుతుందో కాలమే నిర్ణయిస్తుందటూ సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో అవాక్కైన ప్రవీణ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బెదిరింపులకు తెరలేపిన ప్రవీణ్ వర్గీయులు

ధరణికోటకు చెందిన వడ్డినేని సంజయ్ ఇటీవల కొమ్మాలపాటికే టికెట్ అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. గురువారం అధిష్ఠానం ప్రవీణ్‌కు సీటు కేటాయించడంతో ఆయన వర్గానికి చెందిన అచ్చంపేట మండలం వేల్పూరుకు వాసి వంకాలపాటి భాస్కర్ సంజయ్‌కు ఫోను చేసి బెదిరించిన ఆడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పెదకూరపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడు వెల్లలచెరువు సురేష్ ఇటీవల భాష్యం ప్రవీణ్‌కు కలవడంతో శ్రీధర్ వర్గీయులు ఆయనపై అసహనం వ్యక్తం చేశారు. టికెట్ ప్రకటించన నేపథ్యంలో .. ఇప్పుడేమంటారని సోషల్ మీడియాలో సురేష్ వీడియో పెట్టారు. ఇలా నియోజకవర్గంలో టీడీపీ రెండు వర్గాలుగా చీలి ఘర్షణ పడుతున్నారు.

చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మవద్దు

- వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- పెదపులివర్రులో సచివాలయం ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు

పెదపులివర్రు(భట్టిప్రోలు): చంద్రబాబు మోసపూరిత హామీల్ని ప్రజలు నమ్మవద్దని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో రూ. 43.60 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన బాపట్ల అర్బన్ డెవలప్‌మెంటు (బౌడ) అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావుతో కలసి ప్రారంభించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ మోసానికి మారుపేరు చంద్రబాబు అన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా ఉండాలని చెప్పారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూ బడుగు, బలహీన వర్గాలకు ఆయన అండగా ఉన్నారని తెలిపారు. టీడీపీని బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90 శాతానికి పైగా జగన్ అమలు చేశారని గుర్తు చేశారు. బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్ చెప్పినట్లు ఈ సారి కూడా ఫ్యాన్ ప్రతి ఇంట్లో తిరుగుతుందని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలా ఉషారాణి, పార్టీ గ్రామ కన్వీనర్ కొనకాల శ్రీనివాసరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు నీలా రమేష్, చౌటూరి రవీంద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

భట్టిప్రోలులో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని గురువారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావుతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, జేసీఎస్ కన్వీనర్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు , వైఎస్సార్ సీపీ నాయకులు మద్దుల గిరిధర్, బండారు శ్రీనివాసరావు, కుందేటి రమేష్, పెరికల శ్యామ్, పడమటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో ఆర్యవైశ్యుల చేరిక

వేమూరు నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు మద్దుల గిరిధర్ ఆధ్వర్యంలో గురువారం అశోక్‌బాబు, దేవినేనిల సమక్షంలో భట్టిప్రోలుకు చెందిన ఐదు ఆర్యవైశ్య కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీ కండువా కప్పి నేతలు సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మద్దుల శివరామ సుబ్రహ్మణ్యం, మద్దుల వాసు, తూనుగుంట్ల శ్రీనివాసరావు, పేర్ల రంగారావు, కోట దుర్గా ప్రసాద్ ఉన్నారు.

గీతాంజలి మృతి కారకులను శిక్షించాలి



కొవ్వొత్తుల ర్యాలీలో సమన్వయకర్త యడం బాలాజీ, మహిళలు

పర్చూరు (చినగంజాం): గీతాంజలి మృతి పట్ల పర్చూరులో గురువారం ర్యాలీ నిర్వహించారు. పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ ఆధ్వర్యంలో స్థానిక బొమ్మల సెంటర్‌లో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో మహిళలు భారీగా పాల్గొన్నారు. గీతాంజలి మృతికి కారణమైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆమెకు సంతాపం వ్యక్తం చేశారు. మృతికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.

వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శం

- నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ
- పర్చూరులో వలంటీర్లతో ఆత్మీయ సమావేశం


మాట్లాడుతున్న సమన్వయకర్త బాలాజీ

పర్చూరు (చినగంజాం): కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలకు తెగించి పోరాడింది వలంటీర్లేనని పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ కొనియాడారు. పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం నియోజక వర్గంలోని ఇంకొల్లు, పర్చూరు, యద్దనపూడి, కారంచేడు, మార్టూరు గ్రామాలకు చెందిన వలంటీర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు తిరిగి అమలు కావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకా ఆనందకుమారి, బాపట్ల పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి తమ్మా అంజిరెడ్డి, నాయకులు కఠారి అప్పారావు, బండారు ప్రభాకరరావు, మల్లా అంజమ్మ, తులసి నాగమణి, గోరంట్ల శివకుమారి, రావువారి ప్రసాద్, కోట శ్రీనివాసరావు, పఠాన్ కాలేషా వలి, షేక్ బాబుల్లా, పాలేరు వీరయ్య, ముప్పాళ్ల రాఘవయ్య, గాజుల రమేష్, కంచెనపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల పురపాలిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి


శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బలరాం, సమన్వయకర్త వెంకటేష్

చీరాల: చీరాల పురపాలక సంఘం అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని 32 వార్డులో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను ప్రారంభం చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే కరణం బలరాం మాట్లాడుతూ చీరాల పురపాలక సంఘంలో ఉన్న 33 వార్డులను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి వార్డులో నూతనంగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు చేసి అన్ని వార్డులను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. చీరాల నియోజకవర్గ అభివృద్ధితో పాటుగా చీరాల మున్సిపాలిటీని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో వేగంగా సుందరీకరణ చేస్తున్నామన్నారు. పురపాలక ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా మౌలిక వసతులు, ఆహ్లాదాన్ని అందించేలా పార్కులు అందుబాటులోకి తెచ్చామన్నారు. నిధులు కేటాయించి పూర్తిగా సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం అండగా నిలవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యనిస్తున్న వైఎస్సార్ సీపీని ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి తీసుకురావడం అందరి బాధ్యతన్నారు. రానున్న ఎన్నికల్లో చీరాల వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కరణం వెంకటేష్ పోటీ చేస్తున్నారని భారీ మెజార్టీతో ఆయనను గెలిపించాలని పిలుపునిచ్చారు.

ప్రతిపక్ష పార్టీల హామీలన్నీ మోసపూరితం

నియోజకవర్గ సమన్వకర్త కరణం వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని సమంగా చూస్తూ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్న సీఎం జగనన్నను మళ్లీ సీఎంగా చేసే బాధ్యత అందరిపై ఉందన్నారు. కొద్ది రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జగనన్న మళ్లీ సీఎం అయితేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయని, ప్రతిపక్ష పార్టీల హామీలను నమ్మవద్దని సూచించారు. చీరాల మహిళా డిగ్రీ కళాశాలలో రూ.1.09 కోట్లతో నూతనంగా నిర్మించిన నర్సింగ్ రూములను ఎమ్మెల్యే కరణం బలరాం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బి.జైసన్‌బాబు, వార్డు కౌన్సిలర్లు గొట్టిపాటి ఎబినేజర్, బత్తుల అనీల్, కీర్తి వెంకటరావు, మామిడాల రాములు, చీమకుర్తి బాలకృష్ణ, ఎం.లలిత, సత్యానందం, కలవకూరి యానాదిరావు, నాయకులు, మున్సిపల్ డీఈ ఐసయ్య, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

బాపట్ల: రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలను సకాలంలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా రవాణా అధికారి సురేష్ వివరించారు. దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 50 శాతం పైగా యువత మృత్యువాత పడుతుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తమ శాఖ ఆధ్వర్యంలో అన్ని కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లా లోని పట్టణాల్లో అన్ని ప్రధాన కూడళ్లను క్షుణ్ణంగా పరిశీలించి సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న కళాశాలలు ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా సైన్ బోర్డులు, డేంజర్ గుర్తులు, డైవర్షన్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారిలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్న స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు లైట్లు బ్లింకింగ్ చేయడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై ఇసుక ఉండడంతో ద్విచక్ర వాహనాలు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నాయని ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రపరుచుటకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించే సందర్భంలో గతంలో ప్రమాదాలకు సంబంధించిన వీడియోలు ప్రత్యేకంగా ప్రదర్శిస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పోలీస్ శాఖ పరంగా ప్రమాదాలు నివారించుటకు తీసుకున్న చర్యలను వివరించారు.ఈ సమావేశంలో నేషనల్ హైవేస్ అధికారి వెంకట్ దీపక్, క్రైమ్ డీఎస్పీ జగదీష్ నాయక్, డీసీహెచ్ఎస్ శేషు కుమార్, ప్రజా రవాణా శాఖ డీయం శ్రీనివాస్, బాపట్ల మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలకుపాల్పడుతున్న యువకుడి పట్టివేత

- ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- విచారణ చేపడుతున్న జీఆర్పీ పోలీసులు

చీరాల: రైళ్లల్లో తిరుగుతూ నిద్ర పోతున్న ప్రయాణికుల వద్ద విలువైన వస్తువులను చోరీ చేస్తున్న దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని బోస్‌నగర్‌కు చెందిన ఓ దొంగను చీరాల జీఆర్పీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. విజయవాడ నుంచి తిరుపతి వరకు వెళ్లే రైళ్లల్లో తిరుగుతూ నిద్రపోతున్న ప్రయాణికుల వద్ద ఉండే ల్యాప్‌ట్యాప్‌లు, బంగారం, సెల్‌ఫోన్లు వంటి విలువైన వస్తువులు అపహరించి అందిన కాడికి అమ్మి జల్సాలు చేస్తుంటాడు. ఇతనిపై పలు జీఆర్పీ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. చీరాల జీఆర్పీ పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఉంచి చేపడుతున్న విచారణలో భాగంగా బోస్‌నగర్‌కు చెందిన ఓ దొంగను అదుపులోకి తీసుకుని విచారించగా చీరాల, బాపట్ల, తెనాలి, విజయవాడ, వరంగల్, తిరుపతి స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని సమాచారం. ఇతని వద్ద ల్యాప్‌ట్యాప్‌లు కొనుగోలు చేసిన వ్యక్తుల సమాచారాన్ని పోలీసులు సేకరించి వారిని విచారిస్తున్నారని తెలిసింది.

గ్రానైట్ క్వారీల్లో తనిఖీల అడ్డగింత

బల్లికురవ: బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో గ్రానైట్ క్వారీల్లో తనిఖీలకు వచ్చిన మైనింగ్ అండ్ విజిలెన్స్ అధికారులను రెండో రోజు గురువారం క్వారీ యాజమాన్య అనుచరులు అడ్డుకున్నారు. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ దిగువ భాగంలో సాయిలక్ష్మీ గ్రానైట్, సంతమాగులూరు మండలంలో లక్ష్మీ ప్రసాద్‌కు రెండు క్వారీలున్నాయి. మైన్స్ అండ్ విజిలెన్స్ ఏడీ బాలాజీ నాయక్ క్వారీల్లో ఎగుమతులకు సిద్ధంగా ఉన్న రాళ్లను పరిశీలించేందుకు టీంతో వెళ్లారు. అధికారులు ప్రవేశించకుండా ప్రధాన రోడ్డుకు గ్రానైట్ రాళ్లను అడ్డుపెట్టి మూసేశారు. బల్లికురవలో రోడ్డుకు అడ్డుగా ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్, డంపర్లు అడ్డుపెట్టి క్వారీలోకి రాకుండా కర్రలు అడ్డుకట్టారు. చేసిదిలేక వారు వెనుదిరిగారు. తనిఖీలను అడ్డుకున్నారని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏడీ తెలిపారు.

‘దళిత మహిళనని దుర్భాషలాడారు’

మున్సిపల్ చైర్‌పర్సన్ లెక్కనబోయిన ఎస్తేరమ్మ ఆవేదన

అద్దంకి: బాపట్ల జిల్లా అద్దంకి పట్టణంలోని మున్సిపల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు వైఎస్సార్ సీపీ ఎస్సీ సామాజికవర్గానికి చెందిన చైర్‌పర్సన్ లెక్కనబోయిన ఎస్తేరమ్మను మరో దళిత మహిళా కౌన్సిలర్‌తో దుర్భాషలాడించడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి లోనై కంట తడి పెట్టుకునేలా చేశారు. ఈ సంఘటన గురువారం స్థానిక అద్దంకి మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో అధికారుల సాక్షిగా జరిగింది. టీడీపీ నాయకులు తనను కించపరిచిన విషయమై చైర్‌పర్సన్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ టీడీపీ కౌన్సిలర్ల పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు. కావాలని ఆరో వార్డుకు చెందిన టీడీపీ కౌన్సిలర్ కంపా రజని తనను చాలా సార్లు కించపరుస్తూ మాట్లాడారన్నారు. అజెండా కాపీని విసిరేసిందన్నారు. టీడీపీకి చెందిన 12, 14, 11, 6వ వార్డు కౌన్సిలర్లు ఇష్టం వచ్చినట్లు తనపై వేలు చూపించి దుర్భాషలాడారన్నారు. 20వ వార్డు కౌన్సిలర్‌పైకి 12 వార్డు టీడీపీ కౌన్సిలర్ దాడి చేయబోయారని అన్నారు. తనకు చాలా బాధగా ఉందంటూ కంటనీరు పెట్టుకున్నారు. ఎస్సీలంటే అంత చులకనా అని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు టీడీపీ అరాచకాలపై మండిపడుతూ మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం వస్తే ఇలాంటి అరాచకాలెన్నో చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను స్థానికులు తీవ్రంగా ఖండించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలో ఒకరు డిబార్

నరసరావుపేట ఈస్ట్: జూనియర్ ఇంటర్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు గురజాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడి డిబార్ అయ్యాడు.చివరి రోజు పరీక్షలకు జిల్లాలో 16,251మంది విద్యార్థులకు గానూ 15,465 మంది విద్యార్థులు హాజరయ్యారు. మరో 780 మంది గైర్హాజరయ్యారు.

తేనెటీగల పెంపకం లాభదాయకం


రైతులకు అవగాహన కలిగిస్తున్న శాస్త్రవేత్తలు

చీరాల టౌన్: మార్కెట్‌లో తేనెకు మంచి డిమాండ్ ఉన్న దృష్ట్యా గ్రామీణ ప్రాంత ప్రజలు తేనెటీగల పెంపకం చేయడం మంచి లాభదాయకమని బాపట్ల వ్యవసాయ శిక్షణ కళాశాల ప్రతినిధి వి.శ్రీనివాసరావు సూచించారు. గురువారం మండలంలోని తోటవారిపాలెం గ్రామంలో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, బాపట్ల వ్యవసాయ కళాశాల సహకారంతో ప్రొటెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కీటకశాస్త్రం పరిశోధకుడు వి.శ్రీనివాసరావు, ఎస్ఆర్ కోటేశ్వరరావులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ఎస్సీ రైతులకు సబ్‌ప్లాన్ ద్వారా తేనెటీగల పెంపకానికి ప్రభుత్వం చేయూత నందిస్తుందన్నారు. తేనెటీగల పెంపకం ద్వారా తేనె ఉత్పత్తి అవుతుందని పోషకాలు కలిగిన తేనె ద్వారా ఆర్థిక చేయూత లభిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని తేనెటీగల పెంపకాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత శాస్త్రవేత్త చంగల్‌రావు, అసోసియేట్ ప్రొఫెసర్ కె.సుశీల, ప్రొటెక్ట్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ శారదకు షారోన్ అంతర్జాతీయ సేవా అవార్డు

తెనాలి: కరోనా రోజుల్లో బాధితులను వైద్యసేవలను అందించటంతో సహా మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలి కోసం కృషి చేస్తూ, ప్రస్తుతం ధర్మ ప్రాజెక్టుతో గోల్డెన్ అవర్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారదకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కనుంది. కెనడాకు చెందిన ప్రముఖ స్వచ్ఛంద సేవకురాలు షారోన్ పేరుతో ఇవ్వనున్న షారోన్ అంతర్జాతీయ సేవా అవార్డు–2024కు ఎంపికయ్యారు. స్థానిక పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంధ సేవాసంస్థ అధ్యక్షుడు ప్రదీప్ దోనేపూడి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో ఏర్పాటయ్యే ప్రత్యేక సభలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఇటీవల మృతిచెందిన షారోన్ తన జీవితకాలం అంతా ఘన, పెరు లాంటి అతి పేద దేశాల్లోని పేదలకు సేవలను అందించినట్టు ప్రదీప్ తెలియజేశారు. ఆమె గౌరవార్థం ఏటా షారోన్ అంతర్జాతీయ సేవా అవార్డును బహూకరించాలని నిర్ణయించినట్టు తెలిపారు. తొలిగా డాక్టర్ శారదకు, వచ్చే ఏడాది అవార్డును జమైకాలో ఉంటున్న భారతీయ వైద్యుడు డాక్టర్ నాగ మల్లేశ్వరరావుకు బహూకరిస్తామని వివరించారు. ఐఎంఏ, తెనాలి శాఖ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మితోపాటు పట్టణ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొంటారని పెన్నీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు.

17న జూనియర్ బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): న్యూ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా బాస్కెట్ బాల్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉదయం 10 గంటలకు అంకిరెడ్డి పాలెంలోని బాస్కెల్ బాల్ కోర్టులో జూనియర్ బాలబాలికల జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తామని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రేవతి, జి.ఆంజనేయులు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2006 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. పోటీలకు వచ్చే వారు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ తీసుకురావాలని తెలిపారు.

ముగిసిన ఇంటర్ ప్రథమాధ్యాయం

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ప్రథమ సంవత్సర విద్యార్థులకు ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు గురువారం ముగిశాయి. ఈనెల ఒకటిన పరీక్షలు ప్రారంభమైంది మొదలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయి. జూనియర్ ఇంటర్ పరీక్షలు జరిగిన రోజుల్లో మొత్తం నాలుగు మాల్ ప్రాక్టీసు కేసులు నమోదయ్యాయి. గురువారం జరిగిన జూనియర్ ఇంటర్ కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 92 పరీక్ష కేంద్రాల పరిధిలో దరఖాస్తు చేసిన 33,146 మంది విద్యార్థులకు 32,093 మంది హాజరయ్యారు. పరీక్షలు ముగిసిన ఆనందంలో పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వస్తూనే విద్యార్థులు ఆనందోత్సాహాలతో కనిపించారు. పరీక్ష కేంద్రాల్లో కొత్తగా పరిచయమైన కొత్త మిత్రులకు వీడ్కోలు పలికి, ఆయా విద్యాసంస్థల బస్సులు, వాహనాల్లో వెళుతూ అరుపులు, కేకలతో హుషారెత్తారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

సత్తెనపల్లి: రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రజలు సహకరించాలని సత్తెనపల్లి డీఎస్పీ జీసీ గురునాథ్ బాబు అన్నారు. పట్టణంలోని 1,2,6 వార్డుల మీదుగా పురవీధుల్లో గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం బలగాలు సబ్ డివిజన్‌కు చేరుకున్నాయన్నారు. సబ్ డివిజన్‌లోని సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పోలీసు బందోబస్తు కొనసాగుతుందన్నారు. శాంతి భద్రతలు కాపాడటమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తారన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

